జీడికి మద్దతు ధర కల్పించాలి

డిఆర్‌ఒకు వామపక్షాల నాయకుల వినతి

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి, టి.ప్రకాశరావు మాట్లాడుతూ 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. జీడి రైతులకు మద్దతు ధర లేక తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ దళారుల పక్షాన ఉంటుందా? రైతుల పక్షాన ఉంటుందా? ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా కొనుగోలుపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

జీడిపప్పు ధర ఆకాశాన్ని తాకుతుంటే, జీడిపిక్కల ధర పాతాళానికి చేరుతోందని చెప్పారు. ప్రభుత్వ అండతో జీడి యాజమాన్యాలు సిండికేట్‌గా మారి తక్కువ ధర ఇచ్చి జీడి రైతులను దోచుకుంటున్నాయని విమర్శించారు. విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం, జీడి పిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. 2019లో 80 కేజీల జీడిపిక్కల బస్తా రూ.14 వేలు ఉండగా, నేడు రూ.ఏడు వేలకు పడిపోయిందని, వ్యాపారుల దోపిడీకి ఇదే సాక్ష్యమన్నారు. స్థానిక మంత్రి అప్పలరాజు జీడి మద్దతు ధరపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జీడి పరిశోధనా కేంద్రం, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జీడి రైతులకు రుణాలు ఇవ్వాలని, స్థానిక రైతుల నుంచి పిక్కల కొనుగోలు పూర్తయ్యాకే విదేశీ పిక్కల దిగుమతికి అనుమతించాలని, జీడి పండే ప్రాంతాల్లో జీడి అభివృద్ధి బోర్డులు ఏర్పాటు చేసి జీడి పంటను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల పోరాటానికి తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.

పాతపట్నం : కె.గోపాలపురం, ఎస్.గోపాలపురం మధ్య కాజ్‌వేపై ప్రవహిస్తున్న మహేంద్రతనయ వరదనీరు

ముంచెత్తిన వాన

- వాయుగుండం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు
- మహేంద్రతనయలో పెరిగిన వరద ప్రవాహం
- పాతపట్నంలో నీట మునిగిన కాజ్‌వే
- రాష్ట్రంలోనే అత్యధికంగా తామాడలో వర్షపాతం
- శ్రీకాకుళంలో జలమయమైన ఆర్‌టిసి కాంప్లెక్స్

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ వర్షపాతం నమోదైంది. ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో మహేంద్రతనయ నదిలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో పంట పొలాలు నీటమునిగాయి. శ్రీకాకుళంలో భారీగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జిల్లాలో ఒక్కసారిగా సగటు వర్షపాతం అమాంతంగా పెరిగింది. పలు ప్రాంతాలు వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వాయుగుండం ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల కుండపోత వర్షం కురిసింది. లావేరు మండలం తామాడలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షం కురిసింది. సాయంత్రం ఏడు గంటల సమయానికి 187.75 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎచ్చెర్లలో 140.5 మి.మీ వర్షం కురిసింది. నరసన్నపేటలో 109.5 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరంలో 107.5 మి.మీ, ఆమదాలవలస మండలం మెట్టక్కివలసలో 92 మి.మీ, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 91 మి.మీ, ఆమదాలవలసలో 88.25 మి.మీ వర్షం కురిసింది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో 87.25 మి.మీ, నరసన్నపేటలో 86.75 మి.మీ వర్షం పడింది. ఇచ్ఛాపురం మండలం బొడ్డపడలో అత్యల్పంగా 2.5 మి.మీ వర్షం పడింది. వంశధార, నాగావళిలో నదులు సాధారణ స్థితిలోనే ప్రవహిస్తున్నాయి. హిరమండలం గొట్టాబ్యారేజీలోకి 8,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, అంతే పరిమాణంలో కిందికి వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువలకు నీటిని ఆపేశారు.

శ్రీకాకుళం నగరాన్ని ముంచెత్తిన వాన

శ్రీకాకుళం నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలుదపాలుగా కురిసిన వాన శ్రీకాకుళం నగరాన్ని ముంచెత్తింది. వీధులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. ప్రధాన రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కత్తెరవీధి, మండలవీధి, పి.ఎన్ కాలనీ, విశాఖ బి కాలనీ, డిసిసిబి కాలనీలు వర్షపు నీరు పోటెత్తింది. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు సైతం నీట మునిగాయి. కళింగరోడ్డు, పాతబస్టాండ్, లక్ష్మీటాకీస్ ప్రాంతం, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, జిటి రోడ్డు, కృష్ణాపార్కు, రైతుబజారు తదితర రోడ్లతో పాటు పలు వీధులు, కాలనీలు జలమయమయ్యాయి. హడ్కోకాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జనం అవస్థలు పడ్డారు.

పాతపట్నంలో నీట మునిగిన కాజ్‌వే

ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో మహేంద్రతనయలో 450 క్యూసెక్కుల వరద ప్రవాహం పెరిగింది. మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పాతపట్నం సమీపంలోని కాజ్‌వేపై నుంచి భారీ వరద నీరు ప్రవహించింది. దీంతో కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలకు పాతపట్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. పాతపట్నం గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు.

మండలం	ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
శ్రీకాకుళం	ప్రభుత్వ మహిళా కళాశాల	78.75
శ్రీకాకుళం	బలగ	76.75
రణస్థలం	గరికపాలెం	67.75
శ్రీకాకుళం	ప్రభుత్వ డిగ్రీ కళాశాల	65.75
రణస్థలం	పైడిభీమవరం	63.25
లావేరు	లావేరు	60.50
శ్రీకాకుళం	ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్	61.75
గార	గార	58.25
గార	తూలుగు	58
ఆమదాలవలస	తిమ్మాపురం	56
ఆమదాలవలస	మెట్టక్కివలస	53.75
ఆమదాలవలస	ఆమదాలవలస	52.75
సరుబుజ్జిలి	విజయరామపురం	40.0
లావేరు	లావేరు	46.75
నరసన్నపేట	నరసన్నపేట	34.75
కోటబొమ్మాళి	నిమ్మాడ	22
టెక్కలి	రావివలస	21.0
సంతబొమ్మాళి	సంతబొమ్మాళి	26.25
హిరమండలం	గొట్టాబ్యారేజీ	20.75
కోటబొమ్మాళి	కోటబొమ్మాళి	20.75
జి.సిగడాం	జి.సిగడాం	19.50
నందిగాం	మదనాపురం	17.0
సోంపేట	బాతుపురం	15.25
మందస	హరిపురం	14
బూర్జ	కొల్లివలస	12.75
కవిటి	రాజపురం	12.75
పలాస	పలాస	11.5
కంచిలి	ఎం.ఎస్ పల్లి	11

ఆర్‌టిసి కాంప్లెక్స్ జలమయం

శ్రీకాకుళం నగరంలో కురిసిన భారీ వర్షానికి ఆర్‌టిసి కాంప్లెక్స్ నీటమునిగింది. కాంప్లెక్స్‌లోకి సమీప ప్రాంతం నుంచి వర్షపు నీరు చేరడంతో కాంప్లెక్స్ ప్రాంగణం జలమయమైంది. దీనికితోడు కాలువలు పొంగిపొర్లడంతో మోకాలు లోతు మేర వర్షపు నీరు చేరింది. కాంప్లెక్స్‌లోకి ఏకంగా వర్షపు నీరు చొచ్చుకుపోయింది. మురుగునీటిలోనే ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బంది రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఖరీఫ్ సాగుకు సానుకూలం

జిల్లాలో పడుతున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు సానుకూలంగా మారనున్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 26 వరకు సాధారణంగా 282.3 మి.మీగా వర్షపాతం నమోదవుతుంది. ప్రస్తుతం 328.4 మి.మీ వర్షం కురిసి 16.3 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 30 మండలాలకు గానూ 16 మండలాలు అధిక వర్షపాతం నమోదైన కేటగిరీలో ఉన్నాయి. తొమ్మిది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఐదు మండలాలు వర్షపాతం లోటు జాబితాలో ఉన్నాయి. ఈనెల 24వ తేదీ నాటికి జిల్లాలో ఏడు మండలాల్లో అధిక వర్షపాతం, 11 మండలాల్లో సాధారణ వర్షపాతం జాబితాలో ఉండేవి. వర్షపాతం లోటు జాబితాలో 11, తీవ్ర వర్షపాత లోటు కేటగిరీలో ఒక మండలం ఉండేది.

నిబంధనలు ఉల్లంఘించే ఆస్పత్రులపై చర్యలు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యశ్రీ ట్రస్టు నిబంధనలను ఉల్లంఘించి, రోగులకు సకాలంలో వైద్యం అందించని ఆస్పత్రులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆస్పత్రుల్లో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు.

రానున్న సీజన్ల వారీగా గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా ఆస్పత్రులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి ఎలాంటి నోటీసు వచ్చినా సకాలంలో స్పందించాలని, సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. రిమ్స్ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రతిరోజూ క్రానిక్ ఒపి అందుబాటులో ఉంచి, రోగులపై స్నేహపూరిత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పొగిరి ప్రకాశరావు, డిసిహెచ్ఎస్ భాస్కరరావు, పలు ఆస్పత్రుల ప్రతినిధులు సోమేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, కె.దుర్గాప్రసాద్, సాగరిక, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ప్రారంభం

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఉద్దానం శుద్ధజల తాగునీటి ప్రాజెక్టును త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో మూడు నియోజకవర్గాల ప్రజల తాగునీటి కల నెరవేరబోతోందని చెప్పారు. హిరమండలం, మెళియాపుట్టి వద్ద రూ.700 కోట్లతో నిర్మాణం చేపడుతున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి బుధవారం పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 148 కిలోమీటర్ల మేర పైపులైన్ల ద్వారా తాగునీటిని అందించనున్నట్లు చెప్పారు. రోజుకు 8.4 కోట్ల లీటర్ల వంశధార నీటిని మెళియాపుట్టి వద్ద శుద్ధజలంగా మార్చి ప్రతి ఇంటికీ అందిస్తామని తెలిపారు.

ఉద్దాన ప్రాంత భూగర్భజలాలు కిడ్నీ వ్యాధులకు కారణమేమోనన్న కోణంలో వంశధార నదీ జలాలను ఎత్తిపోతల ద్వారా శుద్ధి చేసి, ఎక్కడికక్కడ నీటి నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటు ద్వారా మళ్లీ శుద్ధి చేసి ఇంటింటికీ అందించనున్నామని వివరించారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మహమ్మారిని శాశ్వతంగా పారదోలేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ ద్వారా పలాస వరకు నీరు వస్తోందని, మరికొద్ది రోజుల్లో ఇచ్ఛాపురంలో ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పురుషోత్తపురం వరకు వస్తుందని తెలిపారు. ఇప్పటికే రూ.700 కోట్లు మంజూరు కాగా, అదనపు నిధులు కావాలని ఇంజినీరింగ్ అధికారులు పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్, వంశధారలు ఎస్‌ఇలు టి.ఎస్ ప్రసాద్, డోల తిరుమలరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జాన్ బెనహర్, డిఇ మధుసూదనరావు, ఆశాలత, రజాక్, తహశీల్దార్లు పి.సరోజిని, బి.మురళీమోహన్, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత పాత్ర కీలకం

- ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలి
- ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ క్యాంపస్‌లో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం న్యూ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 ఏప్రిల్‌లో కార్గిల్ యుద్ధంలో సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని గుర్తుచేశారు. పాకిస్థాన్ దళాలు, తీవ్రవాదులు ఆక్రమించిన కార్గిల్‌లోని అన్ని సైనిక పోస్టులను తిరిగి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అప్పట్నుంచీ ప్రతి ఏడాది జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. మన దేశాన్ని రక్షిస్తూ కార్గిల్‌లో అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైనికుల సేవలను దేశం ఎప్పటికీ మరిచిపోదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న సైనికులే నిజమైన హీరోలని అన్నారు. అనంతరం ఎఎస్‌పితో పాటు పలురంగాల్లో సేవలందిస్తున్న వారిని సత్కరించారు. కార్యక్రమంలో హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్, ఇంటాక్ ప్రతినిధి వి.జగన్నాథం నాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, ఇండియన్ ఆర్మీ మేజర్ సుబేదార్ డి.విష్ణుమూర్తి, సబార్డినేటర్ రవికుమార్, ఎస్ఐ ప్రవళ్లిక, కొల్లి విశ్వనాథం, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి విఠలేశ్వరరావు

మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత్తు పదార్థాలను అరికట్టేందుకు పటిష్ట నిఘా అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. అధికారుల సమిష్టి కృషితో జిల్లాలో మత్తు పదార్థాలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. మత్తు పదార్థాల నివారణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారుల అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు చిన్న టాబ్లెట్ రూపంలోనూ వచ్చాయని చెప్పారు. మత్తు పదార్థాల వినియోగం గతంలో కొందరిలో మాత్రమే ఉండేదని, ప్రస్తుతం యువత కూడా బానిసలుగా మారుతున్నారని తెలిపారు. ఈ విషయంలో పోలీస్, వైద్యారోగ్య, ఎక్సైజ్ శాఖలు, విద్యాసంస్థలు, కళాశాలలు, పాఠశాలల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నివారించవచ్చన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో అధికారులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలని, ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగించినట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు డి.వి విద్యాసాగర్, ఎం.కిరణ్ కుమార్, జెడ్‌పి, సెట్‌శ్రీ సిఇఒలు ఆర్.వెంకట్రామన్, బి.వి ప్రసాదరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జిల్లా బిసి సంక్షేమాధికారి ఇ.అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - పలాస, మెళియాపుట్టి

మణిపూర్‌లో ఘటనలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఘటనలకు బాధ్యులను శిక్షించాలని, శాంతిని నెలకొల్పాలని పలాస జూనియర్ కళాశాల నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లోని ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, మహిళలను నగ్నంగా ఊరేగించిన, హత్యాచారం చేసిన దుండగులను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా అక్కడ ఘర్షణలు జరుగుతున్నా, వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మణిపూర్ ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎఐఎఫ్ మండల అధ్యక్షులు పి.ఈశ్వరరావు, ఆదివాసీ వికాస పరిషత్ కార్యవర్గ సభ్యులు సవర విజయ్, మదన్‌మోహన్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, గిరిజన నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గిరిజనులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్.కిరణ్, సహాయ కూర్మారావు విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటి?

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గానికి గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మండలంలోని పల్లిసారథిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు కుటుంబ పాలనలో నియోజకవర్గాన్ని గాలికొదిలేసి, ఇప్పుడు అభివృద్ధి చేస్తామని చెప్పే ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందని చెప్పారు. ఉద్దానంలో కిడ్నీ బాధితుల కోసం పలాసలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, తాగునీటి కోసం రూ.700 కోట్లతో శుద్ధజల ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కులం, మతం, జెండాలు చూడకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ సిఎం జగన్ సంక్షేమ రథసారధిగా నిలుస్తున్నారని కొనియాడారు.

సంక్షేమ ఫలాలు అందిస్తున్న సిఎంను, వాటిని మీ దరికి చేరుస్తున్న వాలంటీర్లను దూషిస్తున్న వారికి వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్న సంగతి ఎవరూ మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, సర్పంచ్ పోతనపల్లి కుసుమ, మాజీ సర్పంచ్ పోతనపల్లి ధర్మారావు, సర్పంచ్ ప్రతినిధి పోతనపల్లి హేమంత్, తామాడ ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, సచివాలయ కోఆర్డినేటర్ వడ్డి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆమదాలవలస

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం కావాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. పట్టణంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరా పథకం, రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా పనులు చేపడుతోందని చెప్పారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పథకంలో భాగంగా నియోజకవర్గానికి రూ.157 కోట్లతో ప్రతి గ్రామంలో పనులు చేపడుతున్నామని చెప్పారు. వీటిలో ఎన్ని పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీటి నిల్వల కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అవసరమయ్యే ప్రభుత్వ స్థలాలను వేగవంతంగా గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ స్థలాల్లో వాటర్ ట్యాంకులు నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆమదాలవలస మండలంలో 47, సరుబుజ్జిలిలో 43, బూర్జలో 52, పొందూరు మండలంలో 40 వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని వీటి నిర్మాణాల విషయంలో రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, నాలుగు మండలాల ఎఇలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

మాట్లాడుతున్న సూర్యారావు

క్రీడా పోటీలకు కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు ఆటల పోటీలను నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఆరోగ్యపరంగా ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వహణకు న్యాయమూర్తులను ఆహ్వానించాలని సభ్యులు తీర్మానించారు. అలాగే పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, న్యాయవాదులు జి.భాస్కరరావు, పొగిరి చిన్నారావు, భవానీప్రసాద్, ఎ.ఎల్.నారాయణ, హరిప్రియ, స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, వాన కష్ణచంద్, శిష్టు రమేష్, రమణ దయాల్, మామిడి క్రాంతి, వి.దామోదర్, ఎన్.విజయ్‌కుమార్, కె.నాగభూషణరావు, కె.సుభాష్, ఎల్.తవిటినాయుడు, జోగేంద్రనాయుడు, సనపల హరి, జయకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఇ అనంతరావు

సబ్ డివిజన్‌లో 5,188 ఇళ్లు పూర్తి

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం పరిధిలో 10,947 జగనన్న ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 5,188 ఇళ్లు పూర్తయ్యాయని హౌసింగ్ డిఇఇ రెడ్డి అనంతరావు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 69 జగనన్న లేఅవుట్లలో ఈ నెలాఖరు నాటికి 82 శాతం ఇళ్లు పూర్తవుతాయని అన్నారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వుకొనేందుకు రూ.6 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. గతంలో ప్రభుత్వ హౌసింగ్ మంజూరై ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించకపోతే అటువంటి లబ్ధిదారులకు రూ.12 వేలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల సర్వే చేయాలన్నారు. గతంలో ఇళ్లు లేనప్పుడు ఏలా ఉన్నారు? ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఎలా ఉంటున్నారో లబ్ధిదారుల నుంచి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, హౌసింగ్ ఎఇ డొక్కా వైకుంఠరావు పాల్గొన్నారు.

సంక్షేమానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా సంక్షేమానికే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గుప్పిడిపేటలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్షలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలన అందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎంటువంటి వ్యయప్రయాసలు లేకుండా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, సర్పంచ్ ప్రతినిధి పైడి తాత, ఎంపిటిసి పైడమ్మ, తహశీల్దార్ కె.శ్రీరాములు, ఎంపిడిఒ ఉషశ్రీ పాల్గొన్నారు.

పోలాకి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేట సచివాలయంలో సర్పంచ్ ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావులు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల విప్ బొడ్డు అప్పన్న, రైతుభరోసా జిల్లా అడ్వైయిజరీ కమిటీ సభ్యులు సభ్యులు కవిటి రామరాజు, ఎంపిటిసి నంబాళ్ల రాజశేఖర్, మండల కో-అప్షన్ సభ్యులు షేక్ రాజ్, బలగ సూర్యారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పల్లిసారథిలో సర్పంచ్ పోతన్నపల్లి కుసుమ ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి డిక్కల తిరుమలరావు, మాజీ సర్పంచ్ పోతనపల్లి ధర్మారావు, సర్పంచ్ ప్రతినిధి పోతనపల్లి హేమంత్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలో మర్రిపాడు-కె సచివాలయం వద్ద తహశీల్దార్, జోడూరు సచివాలయం వద్ద ఎంపిడిఒ నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒ ఎం.పద్మనాభవం, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెద్దబొడ్డపాడులో నిలదీత

వజ్రపుకొత్తూరు : మండలంలోని పెద్దబొడ్డపాడులో నిర్వహించిన జగనన్న సురక్షలో గ్రామస్తులు నిలదీశారు. దీంతో గందరగోళంగా తయారైంది. సీతాపురానికి చెందిన తమ్మినేన జయరాం తనకు రేషన్ కార్డు, రైతు భరోసా రావడం లేదని నిలదీశారు. మీరు రైల్వే పెన్షనర్ కావడం వల్లే రేషన్ కార్డుతో పాటు రైతు భరోసా రావడం లేదని ఆయనకు అధికారులు సమాధానం ఇచ్చారు. దీనిపై జయరాం మాట్లాడుతూ నాతో పాటు పెన్షను తీసుకున్న వారికి రైతు భరోసా, రేషన్ కార్డు ఎలా అందించారని అధికారులను తిరిగిని ప్రశ్నించారు. రాజకీయంగా తనకు అనుకూలంగా ఉన్న పెన్షనర్లకు రేషన్ కార్డుతో పాటు రైతు భరోసా అందిస్తున్నారని సర్పంచ్ ఢిల్లీరావుపై విరుచుకుపడ్డారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాదన పెరగడంతో కార్యదర్శి సనపల దామోదర్ వారించారు. ఈ విషయమై డిటి వాయిలపల్లి గిరిరాజ్ మాట్లాడుతూ రేషన్ కార్డులు ఇప్పుడు ఇవ్వలేదని, గతంలో జారీ చేసినవి అన్నారు. ఉద్యోగులకు

అధికారులను నిలదీస్తున్న జయరాం

ఆధార్ కార్డు లింక్ ఉంటుందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆధార్ లింక్ లేకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతుండగా, నా ఒక్కరికి మాత్రమే ఎందుకు ఎవ్వడం లేదని అధికారులను నిలదీశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని డిటి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, కొండవూరు సర్పంచ్ కొల్లి భాస్కరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇప్పిలి అప్పన్న, విఆర్ఒ రాణి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఎన్‌సిబిసి ఛైర్మన్‌ను కలిసిన ఎంపీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని పలు సామాజిక తరగతులను ఒబిసి జాబితాలో చేర్చాలని కేంద్ర వెనుకబడిన వర్గాల సామాజిక అభివృద్ధి కమిటీ (ఎన్‌సిబిసి) ఛైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఢిల్లీలో ఆయన ఛాంబర్‌లో కళింగ కోమటి, శిష్టకరణ, సొండి, అరవల సామాజిక తరగతి ప్రతినిధులతో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ స్థాయిలో బిసి తరగతుల జాబితాలో చేర్చాలని కోరారు. ఛైర్మన్‌ను కలిసిన వారిలో బోయిన గోవిందరాజులు, పి.వి.రమణ, డబ్బీరు శ్రీనివాస్, రత్నాల కాశీవిశ్వనాథ్, బెహరా రాజారావు పాల్గొన్నారు.

కలుపుమందు పిచికారీ చేయొద్దు

మౌనిక

ఆమదాలవలస : మరో నాలుగు రోజుల పాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు రైతులు కలుపు, పురుగు నివారణా మందులు పిచికారీ చేసుకోవడం వాయిదా వేసుకోవాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకుని నీటిని బయటకు పంపించాలని అన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆక్రమణలు తొలగించాలి

నందిగాం: మండల వైసిపి నాయకుల మద్దతుతో ఉజ్జీలపేటకు చెందిన కెల్లి వైకుంఠరావు ఆరెకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నారని, ఆ భూమిని స్వాధీనం చేసుకుని ఆ స్థలంలో జగనన్న ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఉజ్జీలపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వైకుంఠరావు చెరువులు, కొండలు అనే బేధం లేకుండా అన్ని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆక్రమణల భూములు స్వాధీనం చేసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ వై.వి.పద్మావతికి వినతిపత్రం అందజేశారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి- పొందూరు

సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఆదేశించారు. మండలంలోని నందివాడ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కార్యదర్శి రామ్మోహన్‌కు సూచించారు. విధుల నిర్వాహణలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ హరిహరరావు

పరిహారం చెల్లించాకే పనులు

స్పష్టం చేసిన మడ్డువలస కాలువ రైతులు

ప్రజాశక్తి- పొందూరు

మడ్డువలస కాలువ పనులకు సంబంధించి తాము కోల్పోయిన భూములకు ఆర్అర్ చట్టం ప్రకారం పరిహారాన్ని చెల్లించిన తరువాతనే పనులను చేపట్టాలని, లేకుంటే పనులను అడ్డుకుంటామని వి.ఆర్.గూడెం, వావిలపల్లిపేట, నరసాపురం గ్రామాల రైతులు అధికారులకు తెలియజేశారు. మండలంలోని మడ్డువలస ఫేజ్-2 కాలువ పనులను అడ్డుకుంటున్న ఆయా గ్రామాల రైతులతో రెవెన్యూ, మడ్డువలస కాలువ, భూసేకరణ అధికారులు బుధవారం పొందూరులో సమావేశాన్ని నిర్వహించారు. మడ్డువలస కాలువ తవ్వకాలకు సంబంధించి తమకు ఇచ్చిన పరిహారం చాలా తక్కువని, దానిని పెంచాలని, లేకుంటే పనులు అడ్డుకుంటామని నరసాపురం రైతులు అధికారులకు తెలియజేశారు. ఒకసారి పరిహారం చెల్లించిన తరువాత మరలా దానిని పెంచడం జరగదని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారులకు ఉండదని ఇన్‌ఛార్జి తహశీల్దార్

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పప్పల వేణుగోపాలం, మడ్డువలస డిఇ నాగేశ్వరరావులు రైతులకు తెలియజేశారు. అలాగే వి.ఆర్.గూడెంలో పది మంది రైతులకు, వావిలపల్లిపేటలో ఐదుగురు రైతులకు పరిహారం అందకపోవడంతో అక్కడా పనులను రైతులు అడ్డుకున్నారు. ఆయా గ్రామాల రైతులను కలిసి నచ్చజెప్పేందుకు అధికారులు ప్రయత్నం చేసినా వారు అంగీకరించలేదు. పరిహారం చెల్లిస్తేనే పనులు జరగనిస్తామని, లేకుంటే అడ్డుకుంటామని అధికారులకు రైతులు తెలియజేశారు.

ఓటరు సర్వే ప్రారంభం

సర్వే చేస్తున్న బిఎల్ఒలు

పొందూరు: మండలంలోని తాడివలసలో ఎట్టకేలకు ఐదు రోజులు తరువాత బుధవారం ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ఇంటింటా సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. సాంకేతిక కారణాలు చూపుతూ బిఎల్ఒలు ఇప్పటి వరకు సర్వేను చేపట్టలేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సాంకేతిక కారణాలను వెంటనే పరిష్కరించుకుని సర్వేను ప్రారంభించాని ఇన్‌ఛార్జి తహశీల్దార్ వేణుగోపాలరావు ఆదేశించారు. దీంతో గ్రామంలో ఎట్టకేలకు బిఎల్ఒలు సర్వేను చేపట్టారు.

మాతృభూమి వైభవాన్ని చాటిచెబుతా

శివగంగాధర్‌ను అభినందిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : మాతృభూమి గొప్పదనాన్ని దేశ విదేశాల్లో చాటిచెప్పే అరుదైన అవకాశం తనకు దక్కిందని, అందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులు గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి, ఇతర కుటుంబ సభ్యులేనని కాలిఫోర్నియాకు ఎనర్జీ కమిషన్ ఛైర్మన్ గుండ శివగంగాధర్ అన్నారు. ఆయన స్వగృహంలో పలువురు ఆయనను పలువురు మర్యాద పూర్వకంగా బుధవారం కలుసుకుని దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేందుకు అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. నాలుగేళ్ల తర్వాత తాను స్వదేశానికి వచ్చానని, తనపై ఎంతో గౌరవంతో స్వాగతించి ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రత్నాల నరసింహమూర్తి, టిడిపి నాయకులు బుక్క యుగంధర్, శిమ్మ నరసింగరావు, మెండ గిరీష్, గోవింద్, రాంబాబు, ఉంగటి రమణ, రామారావు పాల్గొన్నారు.

రైల్వే అండర్ టన్నల్ జలమయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కనుగులవలస వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ టన్నల్‌లో నీరు చేరడంతో 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. 8 నెలల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికీ పూర్తి కాకలేదు. పైగా పక్కనే రైల్వే గేటును మూసివేయడంతో ప్రయానికులు వెళ్లేందుకు వేరే దారి లేక అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నుంచి తమ్మియ్యపేట, అటు నుంచి ఆమదాలవలస వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో తిరుగు ప్రయాణమవుతున్నారు. బొడ్డేపల్లిపేట, కొర్లకోట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అండర్ టన్నల్ పనులు నత్తనడకన సాగడంపై రైల్వే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తికాకుండా రైల్వే గేటును మూసివేయడం ఏమిటని రైల్వేశాఖ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ్మయ్యపేట, ముద్దాడపేట, కంచరాపువానిపేట, కలివరం, పీరుసాహెబ్‌పేట, దూసి తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల స్పీకర్ చొరవతో ముద్దాడపేట కూడలి నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు నూతన రహదారిని నిర్మించారు. ఇప్పటికైనా పాలకులు, రైల్వే అధికారులు చొరవ చూపి రైల్వే అండర్ టన్నలు పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ అండర్ టన్నల్ పనులు పూర్తికాకుండానే రైల్వే గేటు మూసివేయడం దారుణమని అన్నారు. పది గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి గుండానే రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారని, అండర్ టన్నల్ నీటితో నిండిపోవడంతో ఇక్కడ వరకు వచ్చి ప్రయాణికులు ప్రజలు మళ్లీ వెనుతిరిగి వెళ్తుండడం బాధాకరమన్నారు.

జలమయమైన అండర్ టన్నల్

ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న సుమబాల

ఓటరు సర్వే పరిశీలన

ఇచ్ఛాపురం : ఇంటింటా ఓటరు సర్వేలో వాలంటీర్లను భాగస్వాములను చేయొద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుమబాల బిఎల్ఒలకు ఆదేశించారు. మండలంలోని ముచ్చింద్రా, కేదార్‌పురం పంచాయతీల్లో చేపడుతున్న ఓటర్ల సర్వేను బుధవారం పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులూ సర్వేలో పాల్గొవాలని సూచించారు. ఈమెతో పాటు డిటి శ్రీహరి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

గౌతు శిరీష పరామర్శ

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూండిలో ఇటీవల అనారోగ్యంతో మృతి టిడిపి నాయకులు తామాడ గోవిందరావు, గేదెల ధర్మారావులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష బుధవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈమె వెంట టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మెహనరావు, మాజీ ఎంపిపి వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గోవింద పాపారావు, బుల్లోజు శశిభూషణరావు, ఉమామహేశ్వరరావు, మధనాల జోగారావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

రోగికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనారోగ్యంతో బాధపడుతున్న ఇప్పిలి భవాని కుటుంబానికి యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. నందిగాం మండలం జల్లపల్లిలోని ఆమె ఇంటికి బుధవారం వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.12 వేలు చెక్ అందించారు. ఆమె భర్త ఇప్పిలి నవీన్ సెలూన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరికీ సంవత్సరం క్రితం వివాహమైంది. ఇటీవల పాప పుట్టి చనిపోయింది. తరువాత భవాని అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించగా, రెండు కిడ్నీల్లోనూ ఇన్ఫెక్షన్ చేరిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె కిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఈ నిరుపేద కుటుంబ గురించి తెలియగానే యువతరం సేవా సంస్థ సాయం అందించడానికి ముందుకొచ్చింది. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, ఇన్‌ఛార్జిలు కర్ని నారాయణరావు, కర్ని లింగరాజు, గాడి అఖిల్, కొడి నిహాల్, పొలకి వంశి, దున్న జగ్గారావు, జోగరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న సభ్యులు

బూర్జ మండలంపై వివక్ష తగదు

రామకృష్ణ

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండలం అభివృద్ధిపై ప్రస్తుత పాలకులు వివక్ష చూపుతున్నారని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, టిడిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ఎ.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దపేటలో తన నివాస గృహంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేకుండాపోయిందని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, నెల రోజుల క్రితం రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. టిడిపి హయాంలో బొమ్మిక రిజర్వాయరు ఏర్పాటు చేసిందని, తద్వారా 700 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలిందని అన్నారు. ఒనిగడ్డ కాలువ పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. ఇప్పటి వరకు ఏ చెరువులోనూ నీరు చేరని పరిస్థితి నెలకుందన్నారు. పెద్దపేట విత్తనాభివృద్ధి క్షేత్రంలో వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణం చేపడతామని ఆశలు కల్పించిన ప్రభుత్వాలు ప్రస్తుతం చేతులెత్తేసిందని విమర్శించారు.

కాలువ నిర్మాణ పనులు పరిశీలన

కవిటి : కాలువలు ఉపయోగించుకుని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జిజిఎంపి నిధుల రూ.3 లక్షలతో కవిటికొత్తూరు గ్రామం పులకల వీధిలో చేపడుతున్న కాలువ నిర్మాణం పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. దీనికి గ్రామస్తులు సహకరించి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి దుద్ది ధర్మారావు, ఇఒ జి.వీరభద్రస్వామి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తూరు : పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల న్యాయ సేవా సంఘం జూనియర్ సివిల్ జడ్జి మణి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘం సభ్యులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌సైజ్ ఫొటోలతో కూడిన ధ్రువపాత్రలు ఈ నెల 31న ఉదయం10.30 గంటలకు అందజేయాలని సూచించారు.

రహదారులు బురదమయం

కోటబొమ్మాళి : సైకిళ్లను నడిపించుకుంటూ వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

చిన్నపాటి వర్షం కురుస్తే చాలు దమ్ము మడులను తలపిస్తూ బురదమయమైన రహదారిపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొండములగాం పంచాయతీ పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అగ్నిమాపకశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఇక్కడ రోడ్డుకు మోక్షం మాత్రం కలగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిపై రాకపోకలు సాగించే సమయంలో విద్యార్థులు, ఆస్పత్రికి వచ్చే రోగులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి సిసి రహదారి నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని బాపన్నపేట, ఉప్పరపేట గ్రామాల నుంచి హరిశ్చంద్రపురం, యలమంచిలి, గురువెల్లిపేట నూకపేట, తలగానిపేట, వెంకన్నపేట, కస్తూరిపాడు, కురుడు, దంత, పాకివలస గ్రామాలకు, కన్నెవలస నుంచి చుట్టుగుండం, కోటబొమ్మాళి నుంచి నూకపేట, లఖందిడ్డి నుంచి రాయిపాడు గ్రామాలకు వెళ్లే రోడ్లపై చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

భారతదేశంలో పుట్టిన ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా మాతృభూమి రుణం తీర్చుకోవాలని, అవసరమైతే దేశం కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని విశ్రాంత ఆర్మీ జవాన్లు బదకల ప్రసాదరావు, బి.జయకృష్ణ అన్నారు. కార్గిల్ దివస్ వేడుకలను స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ జవాన్లకు సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సరిహద్దులో దేశం కోసం పోరాడడం ఒక మధురానభూతి కలిగిస్తే, మనం భారతీయులుగా జన్మించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిందుమాధవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి : ప్రసాదరావుని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం : మున్సిపల్ కాంప్లెక్స్‌లోని మాజీ సైనికుల సంఘం కార్యాలయం వద్ద కార్గిల్ అమర వీరులకు ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కె.రామకృష్ణ, కృష్ణారెడ్డి, ఎల్.ఆర్.రెడ్డి, బి.ఎల్.నారాయణ, దక్కత విశ్వనాథ్‌రెడ్డి, యు.శంకరరావు పాల్గొన్నారు.


టెక్కలి : సెల్యూట్ చేస్తున్న 'ఓక్లాండ్' విద్యార్థులు

టెక్కలి : విద్యార్థి దశ నుంచే దేశంపై అవగాహన పెంచుకోవాలని ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా విద్యార్థులో పలు జాతీయ గీతాలు ఆలపించారు. అంతకుముందు వీర జవాన్లకు నివాళ్లర్పించారు.

'నేతన్న నేస్తం' బూటకం

ప్రజాశక్తి- నౌపడ

వైసిపి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక సాయం పేరుతో అమలు చేస్తున్న నేతన్న నేస్తం పథకం ఓ బూటకమని టిడిపి రాష్ట్ర పద్మశాలి సాధికారిక సమితి డైరెక్టర్ కూచెట్టి కాంతారావు పేర్కొన్నారు. సంతబొమ్మాళిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సొంత మగ్గం ఉన్న వారికే ప్రభుత్వం నేతన్న నేస్తం అందిస్తుందని, మిగతా వారు లబ్ధి పొందలేకపోతున్నారని విమర్శించారు. టిడిపి హయాంలో చేనేత కార్మికుడు చనిపోతే రూ.60 వేలు ఇన్స్యూరెన్స్‌తో పాటు ప్రతి ఆరు నెలలకూ రూ.4 వేలు చొప్పున ఏడాదికి రూ.8 వేలు జీవనభృతి ఇచ్చి ఆదుకున్నట్లు చెప్పారు. ప్రతి చేనేత ఇంట్లో ఇద్దరు పిల్లలకు వారి డిగ్రీ చదువు వరకు రూ.1200 చొప్పున స్కాలర్ షిప్, అలాగే అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్స పొందితే రూ.15 వేలు మెడికల్ హెల్త్ క్లయిమ్‌లు అందించారన్నారు. సబ్సిడీ యార్న్, రిబేట్ క్లైమ్ అని ఏడాది మూడుసార్లు అందించేవారని గుర్తు చేశారు. ఆప్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు సులభం అయ్యేదని, తద్వారా చేనేత సంఘాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రతి గ్రామంలోనూ రూ.40 లక్షలు విలువతో కూడిన చేనేత కమ్యూనిటీ హాలు భవనాన్ని నిర్మించి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేవారని గుర్తు చేశారు.


కాంతారావు

ఆకాశంలో విరిసిన హరివిల్లు

హరివిల్లు కనువిందు

కోస్తాంధ్రా, ఒడిశా మధ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా బుధవారం ఆకాశంలో ఏర్పడిన హరివిల్లు చూపరులను కనువిందు చేసింది. మండలంలోని నర్సింగపల్లికి సమీపంలో దక్షిణ దిక్కు వైపు కనిపించిన హరివిల్లు గ్రామస్తులతో పాటు ఆ ప్రాంతంలో వెళ్లిన వారినీ ఆలరించింది. చుటూ కొండల ప్రాంతం... పచ్చటి చెట్ల మధ్య వాతావరణం కొత్తగా కనిపించడంతో ప్రజలు ఆనందాన్ని పొందారు. అలాగే మండల కేంద్రంలో వెలసిన ఇంద్రధనస్సు చూపర్లకు అకట్టుకుంది. దీనిని పెద్ద సంఖ్యలో ప్రజలు తిలకించారు. ముఖ్యంగా చిన్నారులు ఇంద్రధనస్సును చూసి సంతోషం వ్యక్తం చేశారు.

– టెక్కలి, కోటబొమ్మాళి

నోటీసు బోర్డుల్లో జీరో వడ్డీ జాబితాలు

అక్కులపేట సచివాలయంలో జాబితాను ప్రదర్శిస్తున్న ఆర్‌పిలు

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మహిళా స్వయంశక్తి సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్న జీరో వడ్డీ నాలుగో విడత అర్హుల జాబితాను గ్రామ వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల సమాచారం నిమిత్తం నోటీసు బోర్డుల్లో ఉంచుతున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా మూడు విడతలగా వడ్డీ రాయితీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నెలాఖరులోగా నాలుగో విడత వడ్డీ రాయితీ పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. మండలంలో 1,114 సంఘాలకు రూ.1.52 కోట్లు అర్హత కలిగిన సంఘాల ఖాతాలకు జమ చేయబోతున్నట్లు వివరించారు. మండల పరిధిలోని 19 సచివాలయాల్లోనూ అర్హత గల సంఘాల జాబితాను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం వివొఎలు, సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న గోవిందరావు

కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ప్రధాన సాగునీటి వనరులకు ఇబ్బంది లేకుండా ఓనిగడ్డ, ఆరు ఓపెన్ హెడ్ ఛానళ్లలో పూడిక పనులను ప్రారంభించామని టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు విన్నవించుకున్నామని అన్నారు. వారు స్పందించి కాలువల్లో పూడికతీత పనులకు రూ.16.90 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మామిడివలస ఎంపిటిసి జి.రాంబాబు, లక్కుపురం సర్పంచ్ వియ్యపు కృష్ణ పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న దాసునాయుడు

అన్నా క్యాంటీన్ పరిశీలన

టెక్కలి : పేదవాడి ఆకలి తీర్చడానికి రూ.5కే అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్నామని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు అన్నారు. స్థానిక ఇందిరా గాంధీ కూడలి వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించే ఏకైక పార్టీ టిడిపి అని అన్నారు. ఈయనతో పాటు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, రెయ్యి ప్రీతీష్ చంద్, దల్లి ప్రసాదరెడ్డి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం ఉన్నారు.

పెరటితోటల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- లావేరు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు చాలా మేరకు రక్తహీనతతో బాధపడుతున్నారని, కిచెన్ గార్డెన్ తయారు చేసుకుని సొంతంగా పౌష్టికాహారం తయారు చేసుకుంటే రక్తహీనతను అధిగమించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ అన్నారు. మండలంలోని కొత్తకుంకాంలో రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా మహిళా రైతులకు పెరటి తోటల పెంపకం, కిచెన్ గార్డెనింగ్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఐదు సెంట్ల పొలంలో పదకొండు రకాల కూరగాయలు ఎలా పండించాలి, వాటికి యాజమాన్యం ఏవిధంగా చేపట్టాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించిన విత్తనాలు రిలయన్స్ ఫౌండేషన్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో తమకు తాము

విత్తనాలను పంపిణీ చేస్తున్న కిరణ్

సొంతంగానూ కిచెన్ గార్డెన్ తయారు చేసుకుని సొంతంగా పౌష్టికాహారం తయారు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల ఇంటి ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చు అని అన్నారు. ఇంతకు ముందు గ్రామంలో తీసుకున్న మట్టి నమూనాలను పరీక్షించి భూసార పరీక్ష నివేదికను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జి.తిరుపతిరావు, సీపాన రాజారావు, మహిళా రైతులు అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

సముదాయాల నిర్వహణపై అసంతృప్తి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు బోధనలో మెళకువలు, నైపుణ్యాలు మరింతగా పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పాఠశాలల సముదాయాలు నిర్వహణపై ఉపాధ్యాయులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సముదాయాలు బుధవారంతో ముగిశాయి. కొన్ని ప్రాథమిక పాఠశాలలకు సముదాయాలు నిర్వహించగా, ఉన్నత పాఠశాలల్లో బోధన చేస్తున్న సాంఘీక శాస్త్రం, భౌతిక రసాయనిక శాస్త్రం, హిందీ, ఆంగ్లం సజ్జక్టులను బోధించే ఉపాధ్యాయులకు సముదాయాలు నిర్వహించారు. ఆయితే సముదాయాల నిర్వహణకు ఎటువంటి అజెండా లేకపోవడంతో ఉపాధ్యాయులకు కాలం వృథా తప్ప ఒరిగిందేమీ లేదని వాపోయారు. కాగా, ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతబడే విధంగా తయారైంది. సముదాయాల నిర్వహణలో విద్యాశాఖ ఉన్నతస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ పెట్టడం వంటి చర్యలతో సమయం వృథాగా అయ్యిందని వాపోతున్నారు. ఇటీవల డిజిటల్ బోర్డు నిర్వహణ, శిక్షణ పేరుతో రెండు రోజులు పాఠశాలలకు దూరమైన ఉపాధ్యాయులు, ఇప్పుడు సముదాయాల పేరుతో పాఠశాలకు దూరమయ్యేమని ఉపాధ్యాయులు వ్యాఖ్యానిస్తున్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ-2 లావణ్య

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలు

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థులకు అవసరమైన రీతిలో జ్ఞానాన్ని అందించేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు అవసరమని ఎంఇఒ-2 బి.లావణ్య అన్నారు. రణస్థలం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఛైర్మన్, ప్రధానోపాధ్యాయులు బి.రమణయ్య అధ్యక్షతన నిర్వహించిన కాంప్లెక్స నిర్వహణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ స్థాయిలో విద్యార్థులున్నా వారికి అర్థమయ్యే విధంగా విద్యనందించేందుకు అవసరమైన బోధనా మెళకువలు ఈ కాంప్లెక్స్ ల ద్వారా తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు ఈ విలువైన ఈ సమయాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అర్జునవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ముందుగా యాగాటిపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో వర్క్ బుక్స్ రాయించి తప్పులను, ఒప్పులను పరిశీలించారు. ఈమెతోపాటు సిఆర్‌పిలు శ్రీనివాస్, యోగానందం ఉన్నారు.

పశుగ్రాసంతో పాల దిగుబడి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నాణ్యమైన పశుగ్రాసాలు పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి పెరుగుతుందని జిల్లా పశువైద్య సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్ అన్నారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని సౌడాం రైతు భరోసా కేంద్రం వద్ద పాడి రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు పశుగ్రాసాలు పండించి మేపినట్లయితే పశువులకు సులభంగా జీర్ణం అవుతుందని, కాల్షియం, ఫాస్వరం వంటి ఖనిజ లవణాలు, ఎండిఇ వంటి విటమిన్లు మెండుగా ఉంటాయని అన్నారు. అలాగే మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వుపదార్థాలు అధికంగా లభ్యమవుతాయని

అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

అన్నారు. పశుగ్రాస విత్తనాలను సబ్సిడీ రూపంలో ఆర్‌బికెల్లో ప్రభుత్వం అందజేస్తుందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ వి.జయరాం, కోటబొమ్మాళి సహాయకులు ఎం.లోకనాథం, పశు వైద్యాధికారులు డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞ, కె.వెంకటేష్ పాల్గొన్నారు.

అర్చకులకు వంశపారంపర్య హక్కు పునరుద్ధరణ

శ్రీకాకుళం అర్బన్ : అర్చకులకు వంశపారంపర్య హక్కును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల ఎన్నో కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి పద్మనాభపండా పేర్కొన్నారు. నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో జిల్లా అధ్యక్షులు అరవెల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన అర్చక సమాఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. రూ. 5 లక్షల వార్షిక ఆదాయం దాటని ఆలయాలను అర్చకులకు అప్పగించడంతో పాటు, ఉద్యోగ విరమణ లేకుండా సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అర్చకులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

శిక్షణ ఇస్తున్న భాగ్యలక్ష్మి

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కెవికె కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మూడో రోజు బుధవారం పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలందరూ గ్రూపుగా ఏర్పడి పైనాపిల్‌తో తయారు చేయబడిన ఉత్పత్తులు జామ్, క్యాండీ, స్క్వాష్‌లు తయారు చేసి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ ఫుడ్ రిజిస్ట్రేషన్, లేబిలింగ్, మార్కెటింగ్ తదితర వివరాలను వివరించారు. అలాగే ఉత్పత్తులు తయారు చేయడానికి కావాల్సిన వస్తువులు, ముడి సరుకు ఎక్కడ దొరుకుతాయన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక, గిరిజన యువతులు తదితరులు పాల్గొన్నారు.

నారు చిగుళ్లను తుంచుతున్న రైతులు

వరి పంటలో రాజీ లేని సూత్రాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి పంటలో రాజీలేని సూత్రాలు పెరుగుతాయని యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో సిబ్బంది రైతుల చేత వరి నారు చిగుళ్ళ తుంచి వరుస క్రమంలో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సేద్యం వరి పంటలో తప్పకుండా పంట మొదటి దశ నుంచే మళ్లీ విత్తనం కట్టే దశ వరకు రాజీలేని సూత్రాలు పాటించాలన్నారు. దీంతో పంటలు పురుగులు తెగుళ్ల బారిన పడకుండా ఉంటాయని అన్నారు. రైతులతో వరి పంట పొలం గట్లపై కంది, బంతి, కూరగాయలను సాగు చేసేలా క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- పోలాకి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి ప్లాస్టిక్ బుట్టను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బుట్టలను తడి, పొడి చెత్తలు వేసుకునేందుకు ప్రతి కుటుంబానికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి నాయకులు కణితి సత్తిబాబు, ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమా, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బుట్టలను పంపిణీ చేస్తున్న కృష్ణచైతన్య